# పల్లెల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వైకాపా హయాంలో పల్లెలను పూర్తిగా విస్మరించి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని, కూటమి ప్రభుత్వం పల్లెల అభివృద్ధికి కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రూరల్ మండలం పాత్రునివలసలో రూ.52 లక్షలతో నిర్మిస్తున్న రోడ్డు పనులకు ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ వైకాపా ఆర్థిక సంఘం నిధులను తన సొంత పనులకు వినియోగించుకొని పల్లెల్లో రోడ్లు, డ్రైన్లు, కాలువలకు నిధులు వెచ్చించలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించి ప్రజలకు కనీసం మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను చేస్తున్నారన్నారు. గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని తెలిపారు. పల్లె పండుగలో గుర్తించిన కార్యక్రమాలకు ఇటీవల శంకుస్థాపన చేశామన్నారు. వాటి పనులను కూడా త్వరలోనే పూర్తి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి ప్రజల మన్నలి పొందుతున్న కూటమి ప్రభుత్వం భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలు చేపట్టి ప్రజలకు అండగా ఉంటుందని పేర్కొన్నారు.




సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శుక్రవారం 8-11-2024

సంపుటి: 20 సంచిక: 191

పేజీలు: 4 వెల: రూ.1




# అలిగితివా సఖా!

- ధర్మానతో ఏకాంతంగా గంటకుపైబడి మాట్లాడిన విజయసాయిరెడ్డి
- మౌనం వీడని ప్రసాదరావు
- జగన్ తరుపున రాయబారిగా వచ్చినట్లు భోగట్టా
- ఒకరి బాధలు ఒకరు ఏకరువు పెట్టుకున్నారని చర్చ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వైకాపా అధిష్టానం వైఖరి పట్ల అలకతో ఉన్న మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావుతో ఆ పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జ్ విజయసాయిరెడ్డి గురువారం సాయంత్రం గంటకు పైగా ఏకాంతంగా చర్చించారు. జిల్లాలో అర్థాంతరంగా నిలిచిపోయిన వైకాపా కార్యాలయ పనులు మళ్లీ ప్రారంభించే విధంగా సూచనలివ్వడానికి శ్రీకాకుళం వచ్చినట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నా అందులో ఏమాత్రం వాస్తవం లేదని అర్థమవుతోంది. నిజంగా పార్టీ కార్యాలయ పనుల మీదే వచ్చి ఉంటే ముందు ఆ పని చూసుకుని ఆ తరువాత ఆ పక్కనే ఉన్న ధర్మాన ఇంటికి వెళ్లి ఉండేవారు. అలా కాకుండా జిల్లాలో పార్టీ నాయకులు అక్కడికి చేరుకోక ముందే ధర్మాన ఇంటికి నేరుగా వెళ్లి ఏకాంతంగా ఒక గదిలో వీరిద్దరూ గంటకుపైగా చర్చించారు. ఆ సమయంలో విజయసాయిరెడ్డితోపాటు విశాఖపట్నం నుంచి వచ్చిన చిన్న శ్రీను, మాజీ మంత్రి గుడివాడ అమరనాథ్‌లు బయట విజిటర్స్ హాల్‌లోనే ఉండిపోయారు. గంటకుపైగా మాట్లాడిన తరువాత బయటకు వచ్చినా ధర్మాన తన మౌనాన్ని వీడలేదు. ఏకాంతంగా నడిచిన చర్చలో ఇద్దరూ గడిచిన ఐదేళ్లలో పార్టీ చేసిన తప్పిదాలను, జగన్మోహనరెడ్డి వ్యవహారశైలిని చర్చించుకుని ఒకరినొకరు ఓదార్చుకున్నట్లు భావిస్తున్నారు. అయితే దీనిపై ఇరువురూ ఎటువంటి ప్రకటన చేయలేదు. ఆ తరువాత కాసేపు విజిటర్స్‌హాల్‌లో అందరితోనూ కలివిడిగా విజయసాయిరెడ్డి మాట్లాడినా ధర్మాన పెద్దగా జోక్యం చేసుకోలేదని తెలుస్తోంది. పార్టీ అధికారం కోల్పోయిన తరువాత ధర్మాన ప్రసాదరావు ఆ పార్టీ అధినేత జగన్మోహనరెడ్డిని కేవలం ఒక్కసారి మాత్రమే కలిశారు. ఆ తరువాత రెండుసార్లు జిల్లా నేతలతో జగన్ సమావేశమైనా ఆ కార్యక్రమానికి ధర్మాన వెళ్లలేదు. జిల్లాలో రాజశేఖరరెడ్డి జయంతి, వర్ధంతి కార్యక్రమాల్లో కూడా ఆయన పాల్గొనలేదు. చివరకు జిల్లా పార్టీ అధ్యక్షుడుతోపాటు, పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు, లీగల్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు పదవులు స్వీకరించే కార్యక్రమం జిల్లా కేంద్రానికి దూరంగా నరసన్నపేటలో పెట్టుకున్నారు. దానికి కూడా ధర్మాన ప్రసాదరావు హాజరుకాలేదు. కొద్దిరోజుల క్రితం జిల్లాలో పార్టీ ఆఫీసు పనులపై ఒక నిర్ణయం తీసుకోవడానికి జిల్లాలో వైకాపా ఇన్‌చార్జ్‌లంతా రావాలని ధర్మాన క్రిష్ణ దాస్ జిల్లా పార్టీ అధ్యక్షుని హోదాలో పిలుపునిచ్చారు. ఎలాగూ పార్టీ కార్యాలయం లేదు కాబట్టి ఆ పక్కనే ధర్మాన ప్రసాదరావు బంగ్లా ఉందని, అందులో సమావేశమవుతున్నట్లు ప్రకటించారు. ధర్మాన ఇంట్లో సమావేశం పెట్టుకుంటే తాము ఎందుకు వస్తామంటూ తమ్మినేని సీతారాం, రెడ్డిశాంతిలు ఈ సమావేశానికి డుమ్మా కొట్టారు. పోనీ ధర్మాన ప్రసాదరావు అయినా వచ్చారంటే ఆయన కూడా ఆయన బంగ్లాలో జరిగే సమావేశానికి రాలేదు. అంత వరకు తన మీటింగులకు ధర్మాన ప్రసాదరావు రాకపోవడానికి సీరియస్‌గా పరిగణించని జగన్మోహనరెడ్డి ఇప్పుడు ఆయన ఇంట్లో జరిగిన సమావేశానికి ఆయన హాజరు కాకపోవడంపై దృష్టి సారించి విజయసాయిరెడ్డిని రాయబారిగా పంపినట్లు తెలుస్తోంది.

విజయసాయిరెడ్డి ఉత్తరాంధ్ర బాధ్యతలు మళ్లీ స్వీకరించిన తరువాత శ్రీకాకుళంలో పెట్టిన తొలి అడుగే ధర్మాన ఇంట్లో పెట్టారు. జగన్మోహనరెడ్డి వ్యవహారశైలి మారితే రెండున్నరేళ్ల తరు వాత ఏదో ఒక నిర్ణయం తీసుకుందామన్న ఆలోచనలో ధర్మాన ప్రసాద రావు ఉన్నారు. ధర్మాన ప్రసాదరావు వస్తే గానీ జిల్లాలో పార్టీ కార్యక్రమాలు ఊపందుకోవన్న రిపోర్టు క్రిష్ణదాస్ జగన్మోహనరెడ్డికి ఇచ్చి ఉన్నారు. ఈమేరకు విజయసాయిరెడ్డి ధర్మాన అలక ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవాలని వచ్చినట్లు కనిపిస్తోంది. వాస్తవానికి విజయసాయిరెడ్డే మొన్నటి వరకు అలిగి ఉన్నారు. ఎప్పుడైతే తాను కోరుకున్న ఉత్తరాంధ్ర ఇన్‌చార్జ్ బాధ్యతలు ఆయనకు అప్పగించారో అప్పుడే ఆయన జగన్మోహనరెడ్డి కుటుంబ ఆస్థుల వివాదంపై చాలారోజుల తరువాత ట్వీట్ చేశారు. అధికారంలో ఉన్నపుడు ధర్మాన ప్రసాదరావుతోపాటు అనేకమంది సీనియర్ నాయకులను కూరలో కరివేపాకులా చూసిన సందర్భాలు కోకొల్లలు. బీసీలకు టిక్కెట్ ఇవ్వాలన్న ఒకే ఒక కారణం చూపించి కనీసం అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యేకు కూడా చెప్పకుండా అభ్యర్థిని ప్రకటించిన నియోజకవర్గాల్లో వైకాపా నాయకులు అందరి పరిస్థితి ఇప్పుడు ధర్మాన ప్రసాదరావు మాదిరిగానే ఉంది. 50 ఏళ్ల నుంచి ప్రకాశం జిల్లా కమ్మ సామా జికవర్గం బలంగా ఉన్న కందుకూరు నియోజకవర్గంలో మానుగుంట మహీధర్‌రెడ్డి అనుచరులైతే అక్కడ ఫ్లెక్సీల్లో జగన్మోహనరెడ్డి ఫోటో పెట్టడానికి కూడా ఇష్టపడడం లేదు. ఇండిపెండెంట్ ఎమ్మెల్యేగా గెలిచిన చరిత్ర ఉన్న మహీధర్‌రెడ్డి ఎమ్మెల్యేగా, మాజీ మంత్రిగా, అవినీతి ఆరోపణలు లేని నాయకుడిగా నిలదొక్కుకున్నారు. ఇక్కడ రెడ్డిని కాదని, పక్కనే ఉన్న కనిగిరి నియోజకవర్గంలో బుర్రా మధుసూ ధన్‌యాదవ్‌ను తెచ్చి కందుకూరులో నిలబెట్టారు. ఆయన బీసీ కావడం ఒక కారణమైతే, ఆయన సొంతూరు కందుకూరు అనేది జగన్మోహనరెడ్డి ఆలోచన. బుర్రాకు టిక్కెట్ ప్రకటించినపుడు పక్కనే ఉన్న మహీధర్‌రెడ్డికి ఒక్క మాట కూడా జగన్మోహనరెడ్డి చెప్పలేదని అప్పట్లో ప్రచారం జరిగింది. ఇలా కేబినెట్ బయట ఉన్నవారికి, కేబినెట్‌లో ఉన్న ధర్మాన ప్రసాదరావు వరకు అనేక అవమానాలు ఎదురయ్యాయి. అంతెందుకు ఉత్తరాంధ్ర బాధ్యతలు ఇవ్వకముందు ట్రబుల్‌షూటర్ అని చెప్పుకునే విజయసాయిరెడ్డి ఎక్కడ ఉన్నారో కూడా కనిపించలేదు. విజయసాయిరెడ్డి స్వస్థలం నెల్లూరు జిల్లా. గత ఎన్నికల్లో అక్కడే ఎంపీగా పోటీ చేశారు. విచిత్రం ఏమిటంటే ఆయనది నెల్లూరు అన్న విషయం ఆ జిల్లాలో ఎవరికీ తెలియదు. నాన్‌లోకల్ అయిన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి విజయసాయిరెడ్డి మీద గెలిచారు. ఆ తరువాత విజయసాయి నాలుగు ట్వీట్లు... ఎంపీలకు బర్త్‌డే విషెస్ చెబుతూ ట్విట్టర్‌లో కాలం గడిపేశారు. వాస్తవానికి ధర్మాన ప్రసాదరావుతో రాయబారానికి జగన్మోహనరెడ్డి దిగివచ్చి ఉండేవారు కాదు. కాకపోతే 2027లో జమిలి ఎన్నికలు వస్తాయని, అప్పటి సరికి కొత్త నాయకత్వాన్ని బలోపేతం చేయలేమన్న ఒకే ఒక్క కారణంతో రాయబేరాలు సాగించినట్లు తెలుస్తోంది. అసలు ధర్మాన అలక వెనుక ఉన్న వంద కారణాల్లో రీజనల్ కో-ఆర్డినేటర్ పదవి కూడా ఒకటి కావడం, ఇప్పుడే అదే కో-ఆర్డినేటర్ ధర్మాన దగ్గరకు రావడం వైకాపాలో మాత్రమే జరుగుతుంది. జిల్లాపరంగా ధర్మానకు డిమాండ్లు ఏమీలేవు. జగన్మోహనరెడ్డి మైండ్‌సెట్ మారడం తప్ప!!




• ఎడిటోరియల్

# ఆర్‌బీఐ హడావుడి..కార్పొరేట్ల కోసమే!!

ఈ ఏడాది సెప్టెంబరులో సగటు ధరల పెరుగుదల తొమ్మిది నెలల్లో లేనట్టుగా 5.5 శాతానికి చేరింది. మరీ ముఖ్యంగా ఆహార వస్తువుల ధరలు 9.2 శాతం దాటాయి. భారతీయుల్లో అత్యధికులు తమ ఆదాయంలో అర్ధభాగం ఆహారంపైనే ఖర్చు పెడతారు. అందువల్ల ఆహార ద్రవ్యోల్బణం మరీ దారుణంగా దెబ్బ తీస్తుంది. ఆహార వస్తువులలోనూ ప్రత్యేకించి కూరగాయల ధరల పెరుగుదల దిగ్భ్రాంతి కలిగించేంత తీవ్రంగా పెరిగింది. ఏడాదికేడాది చూస్తే టమోటాల ధర 42.4 శాతం, ఉల్లిపాయలు 66.2 శాతం, బంగాళా దుంపలు 65.3 శాతం పెరిగాయి. దేశవ్యాపితంగా అత్యధికంగా వినియోగించే కూరగాయలు ఈ మూడే. ప్రభుత్వం దానికి వంత పాడే ఆర్థికవేత్తలు షరా మామూలుగా ఇది వాతావరణ సమస్యల వల్ల వచ్చిన సమస్య అని సాకులు చెప్పడానికి తంటాలు పడినా వాస్తవం మారిపోదు. ప్రతి ఏటా కొన్ని కూరగాయల ధరలు భరించలేని స్థాయిలో మండిపోతాయి. అప్పటికే బరువులమయంగా వున్న కుటుంబాల బడ్జెట్ల నుంచి ఈ కారణంగా వేల కోట్లు గల్లంతవుతుంటాయి. ప్రజలపై భారాలు మరికొన్ని వినియోగ వస్తువులకు సంబంధించి కూడా ధరల పెరుగుదల విపరీతంగా వుంది. వంటనూనెలు కూడా ఆ పెరిగే వాటిలో భాగమే. గత మూడు నెలల్లో ముడి పామాయిల్ ధరలు 45 శాతం పైగా పెరిగిపోవడం కూడా ఇందుకు కొంత కారణం. ముడి పామాయిల్‌ను కేవలం ఆహార పదార్థాల తయారీలోనే గాక సబ్బులు, సౌందర్య సాధనాల తయారీలోనూ ఉపయోగిస్తారు. ఈ భారాలు కూడా నిస్సహాయులైన వినియోగదారులపైకి కంపెనీలు బదలాయించాయి. బడా కంపెనీలకు లాభాలు కట్టబెట్టే తమ విధేయతను ఏ మాత్రం దాచిపెట్టుకోకుండా నిస్సిగ్గుగా ప్రదర్శించే ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం కొన్ని అత్యవసర మందుల ధరలు యాభై శాతం పైగా అంటే సగానికి సగం పెంచుకోవడానికి అనుమతినిచ్చింది. ఔషధ ధరల నియంత్రణ ఉత్తర్వును ఇందుకోసం వినియోగించింది. ఆస్తమా, టిబి, తలసేమియా వంటి వ్యాధుల చికిత్సకూ అలాగే బ్యాక్టీరియా వ్యాప్తిని అరికట్టడానికి ఉపయోగించే యాంటీ బయాటిక్స్‌కూ ఇది వర్తిస్తుంది. ఈ విధంగా ధరలు పెంచుకోనివ్వకపోతే ఫార్మా కంపెనీలు లాభాలు రావడం లేదు గనుక ఈ మందుల ఉత్పత్తి తమకు లాభదాయం కాదని మానేస్తారని వాదన చేసింది. పెట్రోలియం ప్రహసనం ఇదే సమయంలో పెట్రోలియం ఉత్పత్తులపైన హద్దూ అదుపు లేని విధంగా సుంకాలు విధించడం ద్వారా ప్రజలపై పడిన భారానికి అంతే లేదు. అంతర్జాతీయ మార్కెట్లో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ముడి చమురు ధర 18 శాతం పడిపోయినప్పటికీ మోడీ సర్కారు వాటి ధరలు తగ్గించకుండా అదే స్థాయిలో కొనసాగించింది. 2022-23లో వివిధ రకాల పన్నులు, సెస్సుల, సుంకాలు రాయల్టీల ద్వారా కేంద్రానికి రూ.3.5 లక్షల కోట్ల రాబడి వచ్చిందంటే హడలిపోవలసిందే. 2014లో మోడీ ప్రభుత్వం ఇప్పటి వరకూ ఒక్క పెట్రోలియం ఉత్పత్తులపై పన్నుల విధింపు ద్వారానే రూ. 26.74 లక్షల కోట్ల ఆదాయం పొందింది. కనీసం మనసంటూ లేకుండా విధించే ఈ భారం రవాణా ఖర్చులు పెంచేసి ఆహార ధాన్యాలు, కూరగాయల వంటి సరుకులపై అనేక రూపాల్లో ప్రభావం చూపిస్తాయి. ఆర్‌బిఐ బూటకాలు ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు ఆర్‌బిఐ చేసే ప్రయత్నాల గురించి ఎంతగానో దృష్టి కేంద్రీకరిస్తుంటారు. అయితే అదంతా బూటకంగానే కనిపిస్తుంది. 2016 మే నుంచి గడిచిన 102 నెలలో చూస్తే వినియోగదారుల ధరల సూచీ (సిపిఐ) ద్రవ్యోల్బణం ఆర్‌బిఐ నిర్దేశించుకున్న నాలుగు శాతం 28 శాతం దాటిపోయిందని ఆర్థికవేత్తల ఒక అంచనా వెల్లడించింది. ఇకపై గరిష్ట పరిమితి ఆరు శాతంగా వుండాలని నిర్దేశించుకున్న లక్ష్యాన్ని ఆర్‌బిఐ 28 శాతం సందర్భాల్లో అందుకోలేకపోయింది. ద్రవ్యోల్బణం నియంత్రణ కావాలని ఆర్‌బిఐ చేసే హడావుడి కార్పొరేట్ సంక్షేమం కోసం ఉద్దేశించింది తప్ప ప్రజల ప్రయోజనాలతో ముడిపడింది కాదని తేలింది. ఈ చర్యలు బ్యాంకుల వడ్డీ రేట్లతోనూ ఇతర ఆర్థిక విధాన బేహారులతోనూ ముడిపడి వుండటమే ఇందుకు కారణమవుతుంది. ఎన్నిసార్లు వాగ్దానాలు గుప్పిస్తున్నా-ధరల నియంత్రణకు సంబంధించి ప్రభుత్వ విధానం ఈ విధంగా పూర్తిగా కుప్పకూలిపోవడం-అనివార్య ఫలితమే. ఎందుకంటే ఈ విషయంలో నిర్దిష్టమైన చర్యలు తీసుకోవడాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడమే జరుగుతున్నది. వనరులు పెంచుకోవడానికి పెట్రోలియం ఉత్పత్తులపై పన్నులు పెంచుకోవడం వంటి మోసపూరిత పథకాలకు దిగడంతో పాటు ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ పటిష్టతపైన, విస్తరణపైన దృష్టి పెట్టి వుండాల్సింది. బహిరంగ మార్కెట్‌లో ధరల మంత్రజాలాన్ని అదుపు చేసేందుకు అది విరుగుడుగా పనిచేసి వుండేది.

## ఆడపిల్లల జీవితాల్లో వెలుగులు నింపుతున్న

# డీవీ సింగ్ ఫౌండేషన్





**సమాజంలో ఒక వ్యక్తికి గుర్తింపు రావాలంటే విద్య చాలా అవసరం. ముఖ్యంగా ఆడపిల్లల భవిష్యత్తు విద్యతోనే ముడిపడి ఉంటుంది. కానీ ఎన్నో కారణాల వల్ల నేడు ఆడపిల్లలు విద్యకు దూరం అవుతున్నారు. చదువుకునే స్థోమత లేక పనులు చేస్తున్నారు. అలాంటి వారి జీవితాల్లో వెలుగులు నింపడానికి స్థాపించబడింది డీవీ సింగ్ ఫౌండేషన్. ఈ సంస్థ ముఖ్యంగా అమ్మాయిల చదువు కోసం వాళ్లకు కావాల్సిన సౌకర్యాల కోసం కృషి చేస్తుంది.**

పంజాబ్‌లో స్థాపించబడిన డీవీ సింగ్ ఫౌండేషన్ ఫర్ చైల్డ్ డెవలప్మెంట్ చిన్నారులు, ముఖ్యంగా అమ్మాయిల విద్యను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తోంది. 2019లో ప్రారంభమైన ఈ స్వచ్ఛంద సంస్థ ఇప్పటి వరకు పేదరికంలో ఉన్న 700 మందికి పైగా చిన్నారులకు విద్యను అందించింది. 2022లో 'మోస్ట్ ఇన్స్పిరేషనల్ ఎన్జీఓ ఫర్ గర్ల్స్ ఎడ్యుకేషన్' అవార్డును సైతం ఈ ఫౌండేషన్ గెలుచుకుంది. 100 కంటే ఎక్కువ స్వచ్ఛంద సంస్థలతో కలిసి నిధులు సమకూర్చింది.

2011 జనగణన ప్రకారం ఇండియాలో అక్షరాస్యత రేటు పెరుగుతుంది. ఈ ఏడాది రాబోయే జనగణనలో మరింత పెరగనుంది. 2011లో పురుషుల అక్షరాస్యత రేటు 80.44 శాతం, మహిళల రేటు 70.73 శాతం కాగా, మొత్తం సగటు అక్షరాస్యత రేటు 2001 నుంచి 2011 వరకు 6.1 శాతం పెరిగి 75.84 శాతానికి చేరుకుంది. చదవడం, రాయడం నేర్చుకోకపోవడం చిన్నారుల భవిష్యత్తుకు పెద్ద అడ్డంకిగా నిలుస్తోంది. ఈ సమస్యను గుర్తించిన ఫౌండేషన్ ఆడపిల్లలకు విద్యను అందించేందుకు తనవంతు కృషి చేస్తోంది.

పంజాబ్‌తో పాటు మొత్తం భారతదేశం వ్యాప్తంగా అమ్మాయిల విద్యను పెంపొందించేందుకు ఆర్థిక సాయం చేస్తోంది. 2022లో 48 మంది అమ్మాయిల ట్యూషన్ ఫీజులు చెల్లించారు. ఇది వారిలో విద్యను కొనసాగించే నైతిక బలాన్ని పెంచుతుందని పాఠశాల అధికారులు పేర్కొన్నారు.

స్థానికంగా వాలంటీర్ల సాయంతో ఆదివారం తరగతులు నిర్వహించి పిల్లలకు ప్రాథమిక విద్యను అందిస్తున్నారు. 2024 ఆగస్టులో నాలుగు కార్యక్రమాలు నిర్వహించి, స్కూల్ బ్యాగులు, పాఠ్య సామగ్రిని పంపిణీ చేశారు. కంప్యూటర్లు కూడా ఇచ్చి పిల్లలకు డిజిటల్ ఎడ్యుకేషన్ కల్పించారు. విద్య, ఆరోగ్యం, సంక్షేమం వంటి అంశాలపై సామాజిక అవగాహన కల్పించే కార్యక్రమాలను కూడా ఈ సంస్థ నిర్వహిస్తోంది. ఇటీవలే జలంధర్ లోని పాఠశాలలో పోస్టర్ తయారీ పోటీ నిర్వహించారు. ఈ పోటీ ద్వారా విద్యార్థులు కళాత్మకతను బయట ప్రదర్శించేందుకు అవకాశాన్ని పొందారు.

సమాజంలోని అత్యంత వెనుకబడిన ప్రాంతాల్లోని పిల్లల జీవితాల్లో ఎదిగేందుకు ఎలాంటి అడ్డంకులు ఉండకూడదనే లక్ష్యంతో ఈ సంస్థ అనేక కార్యక్రమాలను నిర్వహి స్తోంది. చిన్నారుల కోసం ఆహారాన్ని అందించడం, చదువుకు ఆసక్తి చూపుతున్నా స్కూలుకు వెళ్లేందుకు వెనుకాడుతున్న అమ్మాయిలకు ధైర్యం ఇవ్వడం వంటి విషయాల్లో తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తారు.

డీవీ సింగ్ ఫౌండేషన్ ఫర్ చైల్డ్ డెవలప్మెంట్ గత ఐదేళ్లలో భారతదేశంలోని వందలాది పిల్లల జీవితాల్లో స్ఫూర్తిదాయక మార్పును తీసుకొచ్చింది. విద్యనే



## बालिकाओं को शिक्षित व सशक्त बनाने की राह पर डीवी फाउंडेशन

अंतरराष्ट्रीय बालिका दिवस

कमल किशोर • जागरण

• तीन वर्ष में 150 बेटियों की पूरे वर्ष की फीस करवाई जमा

• सप्ताह में दो बार बेसिक शिक्षा की भी लगाई जाती है कक्षा

जालंधर : अंतरराष्ट्रीय बालिका दिवस समाज में बेटियों की स्थिति में सुधार लाने और बराबरी का स्थान दिलाने की पैरवी करता है।

जालंधर की गैर सरकारी संस्था डीवी फाउंडेशन बालिकाओं को शिक्षित करने के साथ सशक्त बनाने की राह पर अग्रसर है। फाउंडेशन बिना किसी सरकारी सहायता इन बेटियों की पढ़ाई का खर्च उठा रही है। संस्था के सदस्य स्लम क्षेत्र की बेटियों को निशुल्क पढ़ा रहे हैं। सप्ताह में दो से तीन दिन कक्षा लगती है। पिछले तीन वर्ष में ही संस्था 150 बेटियों का स्कूलों में दाखिला करवा चुकी है। साथ ही पूरे वर्ष की फीस भी भर रही है।

फाउंडेशन की ओर से लगाई गई कक्षा में पढ़ती छात्राएं • सौ सदस्य

डीवी फाउंडेशन की शुरुआत वर्ष 2019 में सात सदस्यों के साथ हुई थी। अब संस्था से 122 युवा जुड़ चुके हैं। फाउंडेशन चौगिट्टी, सूर्या एंक्लेव व लद्देवाली रोड की बेटियों को शिक्षित कर रही है। उद्देश्य सिर्फ यही है कि बेटियां अपने पैरों पर खड़ा हो सकें और पुरुषों के साथ कंधा से कंधा मिलाकर चल सकें। शिक्षा क्योंकि अधिकारों की भी पहचान करवाती है, इसलिए आर्थिक रूप से कमजोर वर्ग की बेटियों पर अधिक फोकस है।

फाउंडेशन के सदस्य बताते हैं कि स्लम एरिया क्षेत्र में रहने वाले मां-बाप की आर्थिक स्थिति बेहतर न होने की वजह से वे बेटियों की पढ़ाई बंद कर देते हैं।

कोमल बेटियों को दूसरों के घर में काम करने भेज देते हैं। ऐसी कई बालिकाओं की फीस संस्था ने अदा की और स्कूलों में पढ़ने भेजा, ताकि वे भी सशक्त बन सकें। स्लम एरिया की बेटियों को शिक्षित करने के लिए सूर्या एंक्लेव में कक्षा लगाई जाती है। पेंटिंग मुकाबले भी करवाए जाते हैं, ताकि पढ़ाई बोझ न लगे।

कूड़ा बीनने वाली एक बेटी से शुरू हुआ सफर : बबिता कलेर

डीवी फाउंडेशन की प्रधान बबिता कलेर ने कहा कि एक दिन एक बेटी कूड़ा बीन रही थी। मन में आया क्यों न इसे पढ़ाया जाए। शिक्षित व सशक्त बनाएं। कूड़ा बीनने की स्थिति को देखते हुए मन परेशान था। स्वयं की परेशानी दूर करने के लिए बेटी को पढ़ाने का संकल्प लिया। फिर सफर शुरू हो गया। संस्था का गठन किया। अब आर्थिक रूप से कमजोर परिवारों की बेटियों का स्कूलों में दाखिला करवाया जा रहा है। ऐसे अभिभावकों से भी संपर्क किया जाता है जोकि बेटी की फीस नहीं भर पाते हैं।

बबिता कलेर • स्वयं




శక్తివంతమైన ఆయుధమని వారు నమ్ముతారు. ఆడపిల్లల చదువు కోసం కృషి చేస్తున్న డీవీ సింగ్ ఫౌండేషన్ భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేయాలని కోరుకుందాం. అలాగే మనం కూడా చదువుకునే వారి కోసం తోచినంత సాయం చేద్దాం. యూనిఫాంలు, పుస్తకాలు, బ్యాగులు.. ఇలా మనం ఇవ్వగలిగినంత ఏదైనా సరే పేద వారికి ఇచ్చి వారి భవిష్యత్తుకు భరోసాను కల్పిద్దాం. ఎగిరే స్టేజ్‌లో వారికి కాస్త నమ్మకం ధైర్యాన్ని కల్పిస్తే చాలు.. అదే వారిని ఉన్నత స్థాయిలో నిలబెడుతుంది.

- సత్యంన్యూస్, శ్రీకాకుళం

# అవును..ఇది కథకాదు.. ఓ జీవితం!




**ఇది కథ కాదు . బాలచందర్ సినిమాలు కథల్లాగా ఉండవు . మన చుట్టూ జరిగే సంఘటనలనే సినిమాలుగా తీస్తారు ఆయన. మనసుకు హత్తుకుపోయేలా తీస్తారు. మెదడుతో ఆలోచించే విధంగా తీస్తారు. అలాంటి సినిమాలలో ఒకటి జూన్ 1979 లో వచ్చిన ఈ ఇది కథ కాదు. జయసుధకు ఉత్తమ నటిగా నంది అవార్డుని తెచ్చిపెట్టిన సినిమా.**

ఈ సినిమాలో రెండు స్త్రీ పాత్రలు ఉంటాయి. అందరికీ జయసుధ నటించిన సుహాసిని పాత్రే గుర్తు ఉంటుంది. అంతకన్నా గొప్ప పాత్ర సుహాసిని అత్త గారిది. కొడుకు చేసిన తప్పును సరిదిద్దటానికి విశ్వ ప్రయత్నం చేసి, తన కొడుకు మారడనే నిర్ణయానికి వచ్చి, ఆ కొడుకును వదిలేసి కోడలు వెంట నడిచేందుకు సిద్ధమైన పాత్ర.

ఈ పాత్రను నటించిన నటి పేరు లీలావతి . కన్నడంలో సుమారు 400 సినిమాలలో నటించింది. అన్ని భాషల్లోను కలిపి సుమారు 600 సినిమాలలో నటించింది. మన రమాప్రభ, తమిళంలో మనోరమ లాగా..

జయసుధ గురించి ప్రత్యేకంగా చెప్పవలసింది ఏముంది? మహానటి సావిత్రి, వాణిశ్రీల వారసురాలు.. మూడు మగ పాత్రలు. ప్రతి నిమిషం తాను మగాడిని, మగాడు ఆడది సమానం కాదు, ఆడదాన్ని హింసించడం మగాడి జన్మ హక్కు అని భావించే మృగాడి పాత్రలో చిరంజీవి అద్భుతంగా నటించారు. ఎంత బాగా నటించారంటే సీట్లోనుంచి స్క్రీన్‌లోకి దూరి తన్నాలని అనిపిస్తుంది. అంత బాగా నటించారు. సాడిస్టు పాత్ర. కెరీర్ మొదట్లో ఇలాంటి పాత్రలను చాలానే వేసారు.

మరో పాత్ర జానీ . కమలహాసన్ నటించిన పాత్ర. సుహాసిని మెప్పు కోసం, ఆమె ప్రశాంతంగా ఉండేందుకు అహర్నిశలూ మనసులోనే ఆరాధించే మంచి బాలుడిగా బాగా నటించారు. ఈ పాత్రకు గొప్ప పేరు రావటానికి కారణం వెంట్రిలాక్విజం. ఈ కళను చూపిన మొదటి సినిమా ఇదేనేమో ! అప్పట్లో చాలామంది సాధారణ ప్రజలకు ఈ కళ గురించి తెలియదు. ఇలాంటి పాత్రను ఒకదాన్ని సృష్టించాలనే ఆలోచనే గొప్ప ఆలోచన. ప్రఖ్యాత మిమిక్రి కళాకారులు వేణుమాధవ్ చేస్తుండేవారు. కమలహాసన్ ఈ వెంట్రిలాక్విజం పాత్రను అద్భుతంగా నటించారు.

ప్రేక్షకులు మరచిపోలేని మరో పాత్ర భరణి. జయసుధ , భరణి ప్రేమించుకుంటారు. ఈ పాత్ర కూడా కళాకారుడి పాత్రే. జయసుధ విడాకులు తీసుకున్నాక మరోసారి కథలోకి వస్తుంది. రెండోసారి కూడా జయసుధని పెళ్ళి చేసుకోలేక పోతాడు. సరితను పెళ్లి చేసుకుంటాడు. ఉదాత్తమైన పాత్ర.

మొదట్లో విలన్‌గా నటించిన శరత్‌బాబు పోనుపోను ఇలాంటి ఉదాత్త పాత్రలకు కేరాఫ్ అడ్రస్ అయ్యారు. బాలచందర్ సినిమాలలో పాత్రల సంఖ్య తక్కువగా ఉంటుంది. అలా అని మనకు అనిపించకుండా సినిమాను పరుగెత్తిస్తారు. మనకు తెలియకుండానే సినిమాతో పాటు పరుగెత్తుతూ ఉంటాం.

ఈ సినిమాకు ప్రాణం యం యస్ విశ్వనాథన్ సంగీతం. ముత్యపు చిప్పలో పడితే కానీ వాన చినుకు ముత్యం కాదు. అలాగే మంచి సంగీతం, గాత్రం ఉంటేనే కానీ సాహిత్యానికి గుర్తింపు రాదు. ఈ సినిమాలో పాటలన్నీ ఆత్రేయే వ్రాసారు.

సరిగమలు గలగలలు ప్రియుడే సంగీతము పాట ఈరోజుకీ చెవుల్లో గింగురుమంటూనే ఉంటుంది. చాలా శ్రావ్యంగా ఉంటుంది. సుశీలమ్మ పాడారు. జూనియర్ జూనియర్ అంటూ సాగే ఇటు అటు కాని హృదయంతోని ఎందుకురా ఈ తొందర పాట... పిల్లలకు, సాధారణ ప్రేక్షకులకు భలే నచ్చిన పాట. బాలసుబ్రమణ్యం, రమోలా పాడారు.

కమలహాసన్, సరితలు డాన్స్ పాట తకధిమితక జతజతకొక కథ ఉన్నది పాట ఇద్దరూ అద్భుతంగా నటించారు. ఈ పాటను చూసినప్పుడల్లా నాకు మేరా నామ్ జోకర్ హిందీ సినిమాలో రాజ్ కపూరే గుర్తుకు వస్తారు. అసలు ఈ సినిమాలో ఈ పాత్ర సృష్టికి బాలచందర్‌కు రాజ్‌కపూర్ జోకర్ పాత్రే స్ఫూర్తి ఏమో అని అనిపిస్తుంది. నాకయితే మాత్రం కమలహాసన్ పాత్ర చూసినప్పుడల్లా రాజ్‌కపూర్ జోకర్ పాత్రే గుర్తుకు వస్తుంది.

ఇంకా మరో రెండు పాటలు ఉన్నాయి. గాలికదుపు లేదు కడలికంతు లేదు. సంగీత సాహిత్యాలు రెండూ అదుర్స్. మరో పాట జోల పాట పాడి ఊయలలూపనా పాట. చాలా శ్రావ్యంగా ఉంటుంది. వెరసి ఈ సినిమా సక్సెస్‌కు కారణాలయిన సంగీత సాహిత్య గాత్రాలను అభినందించాల్సిందే.

**కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వాలను బాలచందర్ అందిస్తే, పదునైన డైలాగులను గణేష్ పాత్రో అందించారు. ఇప్పటికీ తరచూ ఏదో ఒక టివి చానల్లో వస్తూనే ఉంటుంది. తక్కువ బడ్జెట్‌తో బాగా హిట్టయిన సినిమా. పైగా బ్లాక్&వైట్ సినిమా. 1977లో తమిళంలో బాలచందర్ తీసిన అవర్ గళ్ సినిమాకు రీమేక్ మన తెలుగు సినిమా. జయసుధ పాత్రను సుజాత పోషించింది. కమలహాసన్ రెడింటిలోనూ నటించారు. చిరంజీవి పాత్రను రజనీకాంత్ పోషించారు. చిరంజీవి, కమల హాసన్ కలిసి నటించిన ఏకైక చిత్రం ఇదొక్కటే. ఈరోజుల్లో కూడా ఈ సినిమాను చూడనివారు ఉండరు. ఎవరయినా ఉంటే అర్జెంటుగా చూసేయండి.**

**'An unmissable, musical, art film'.**

- దోగిపర్తి సుబ్రహ్మణ్యం



తెలుగు సినీ ప్రపంచంలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్న నటి ఈషా రెబ్బా. మోడలింగ్ నుంచి హీరోయిన్‌గా ఎదిగిన ఈషా, తన సహజమైన నటనతో పాటు అందంతో కూడా ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకుంది. ఇటీవలే ఆమె ఎల్లో చీరలో కనిపించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, ఆమెకు ఉన్న క్రేజ్‌ను మరింత పెంచాయి. ఆమెకి మేకోవర్ అందించిన టీమ్ కూడా ఎంతో శ్రద్ధతో ఈ లుక్‌ను సృష్టించడంలో సహకరించింది. చీరలో సంప్రదాయిక అందం మరియు లేటెస్ట్ గ్లామర్ డోస్ తో ఈషా లుక్ అందరి దృష్టిని ఆకర్షించింది. ఈషా కెరీర్ ఆరంభం "అంతకు ముందు, ఆ తర్వాత" వంటి సినిమాల ద్వారా మోస్ట్ ప్రామిసింగ్ యాక్ట్రెస్‌గా పేరు తెచ్చుకుంది. కానీ ఆమెకు విస్తృతంగా గుర్తింపు తెచ్చిన చిత్రం "అ!". ఆ సినిమాలోని ఆమె పాత్ర ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకుంది. తరువాత, అమీ తుమీ, బ్రాండ్ బాబు, దర్శకుడు వంటి చిత్రాల్లో తన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ, ఆమె కెరీర్‌లో మరింతగా ముందుకు దూసుకెళ్లింది. ఈషా రెబ్బా హైదరాబాద్ అమ్మాయే. తెలుగు హీరోయిన్ గా తనకంటూ ఒక ప్రత్యేకమైన క్రేజ్ అందుకున్న అమ్మడు ఎలాంటి పాత్ర చేసినా కొత్తగా ఉంటుందని చెప్పవచ్చు. ఇక సోషల్ మీడియాలో ఆమె లైఫ్‌ను, స్టైల్ కు సంబంధించిన విశేషాలను షేర్ చేసుకుంటూ ఉంటుంది. ప్రతిసారి కొత్త ఫోటోషూట్ల ద్వారా ఆమె తన ఫ్యాషన్ ఐకాన్ ఇమేజ్‌ను కాపాడుకుంటూ, తనకు ఉన్న అభిమానులకు స్ఫూర్తి ఇస్తూ ఉంటోంది. ఈ ముద్దుగుమ్మ అందం మాత్రమే కాదు, తన అభినయం ద్వారా కూడా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సాధించింది. ఇక చివరగా ఈషా సుధీర్ బాబు హీరోగా నటించిన మామా మశ్చీంద్ర సినిమాలో నటించింది. అయితే ఆ సినిమా అంతగా ఆడలేదు. ప్రస్తుతం మరో చిన్న సినిమాలో నటిస్తున్నట్లు సమాచారం.

## గ్లామర్ డోస్ పెంచుతున్న ఈషా రెబ్బా

లేచింది.. నిద్ర లేచింది మహిళాలోకం అని ఒక కవిగారు ఎప్పుడో అన్నారు గానీ అసలు మహిళల్ని నిద్రపోనిచ్చేదెవరు? గతంతో పోలిస్తే చాలా మార్పులు కనిపిస్తున్నాయి కానీ అవి కొన్ని వర్గాలలోనే. కష్టపడి పనిచేస్తే గానీ ఇల్లు గడవని మహిళలు ఎన్ని రకాలుగా నలిగి పోతున్నారో ఎవరన్నా ఆలోచించారా? ఇంటిపని, బయట పని, పిల్లల పని, వారి చదువులు, ఇంట్లో పెద్దవారి బాగోగులు.. అన్నీ మహిళ నెత్తినే. వీటన్నిటినీ తట్టుకున్నా ఆనక వృద్ధాప్యంలో అనేక రోగాలతో సతమతమవుతుంటారు. అందుకే ఈ తరం అమ్మాయిలు పెళ్ళయితే ఉద్యోగం మానేస్తున్నారు. లేదా పెళ్లే ఒద్దనుకుంటున్నారు. చదువుకుని ఆర్థికంగా పర్వాలేదనే కుటుంబాల్లో పరిస్థితి, ఉద్యోగ సమస్యలు మరో రకం.




# మహిళల ప్రగతికి పెళ్లే ప్రతిబంధకమా?


అంతెందుకు? ఇప్పటికి 30 ఏళ్లక్రితం– ఒక దినపత్రికలో జర్నలిస్ట్ ఉద్యోగం. ఒక ఐదేళ్లు ఆడుతూ పాడుతూ గడచిపోయింది. ఇంట్లో ఆంక్షలు, భయాలు ఎప్పుడూ లేవు. కొద్దో గొప్పో ఆఫీస్‌లో మా బాస్‌కే భయపడేదాన్ని. అలా ఆనందంగా ఉద్యోగం చేసే సమయంలోనే వివాహమైంది. అన్నివిధాలా నాకు అనుకూలమైన అబ్బాయే. సరిగ్గా వివాహమైన కొన్నిరోజులకే షిఫ్ట్ మారింది. ఆఫీస్ పక్కనే ఇల్లు కదా పర్లేదులే అనుకున్నా. ఓ రెండేళ్లకు బాబు. అప్పటి నుంచి రకరకాల సమస్యలు. సాయంగా అమ్మావాళ్ళని తెచ్చుకున్నా కొన్ని సందర్భాల్లో ఇబ్బందిగా ఉండేది. ముఖ్యంగా బాబుకి ఒంట్లో బాగాలేనప్పుడు, అమ్మా వాళ్ళు ఊరికెళ్ళినప్పుడు. అలాగే మేనేజ్ చేసేదాన్ని. ఉద్యోగంలో చేరిన కొత్తలోనే మానేయాలని చాలాసార్లు అనుకున్నా. ముఖ్యంగా ఇంట్లో స్వతంత్రంగా పెరిగిన అమ్మాయిలకు ఇంకొకరి కింద మాటలు పడటం అస్సలు నచ్చదు. చుట్టూ ఉన్న పెద్దల హితోక్తులతో మెల్లగా అలవాటు పడ్డాను. మా అబ్బాయికి రెండేళ్ల వయసు ఉన్నప్పుడు మా బాస్ ఒక ఫాషన్ షో కవర్ చేయమని ఆర్డర్ వేశారు. ఆ టైంలో నా భర్త ఊళ్ళో లేరు. చెప్పినా అవన్నీ కుదరవు నేనే వెళ్ళాలి అన్నారు. తిట్టుకుంటూ వెళ్లి అర్ధరాత్రి ఇంటికి చేరినప్పుడు ఎంత డిప్రెస్సింగ్‌గా అనిపించిందో! అప్పుడు మళ్ళీ ఉద్యోగం మానేయాలనిపించింది. కొన్నాళ్ళకి ఇంకో కొత్త బాస్ వచ్చాడు. అతనిది ఎంత పైశాచికానందం అంటే మనం నేర్చుకున్న చదువు, గురువులను కూడా వెక్కిరిస్తాడు. అర్ధరాత్రి దాకా పనిచేస్తేనే ఉద్యోగమన్నట్టు మాట్లాడతాడు. అతనిదగ్గర కొన్నాళ్లకే పూర్తి వైరాగ్యమొచ్చేసింది. అతనికీ అలాగే అనిపించిందేమో ఇంకో సెక్షన్‌కి మార్చేశాడు. అక్కడ ఇన్నేళ్ళుగా నేర్చుకున్నదంతా వృధా అని తేల్చేసారు. రోజూ టీవీ ప్రోగ్రాములు ఇచ్చే పేజీ చూసే పని. మానేయాల్సిన సమయం వచ్చిందని అనిపించింది. మానేశా. నేను పనిచేసిన సంస్థలో మహిళల కోసం ఎటువంటి వెసులుబాట్లు లేవు. రవాణా సౌకర్యాలు లేవు. చిన్నపిల్లల క్రెచ్ కూడా లేదు.

ఇదంతా ఇప్పుడెందుకు అంటారా? మొన్నీమధ్య ప్రపంచబ్యాంకు మనదేశం గురించి, మన ఆడవారి గురించి తెగ బాధపడిపోయింది. చదువుల పరంగా ఆడపిల్లలు అభివృద్ధి సాధించినా ఇంకా పెళ్లి, పిల్లలు వారి ఉద్యోగ జీవితానికి అడ్డు పడుతున్నాయని, అందుకే భారతదేశం ఆర్థికంగా ఎదగలేకపోతోందని వాపోయింది. పైగా చాలామంది పెళ్లవగానే ఉద్యోగం మానేస్తున్నారట. దానికి కారణాలు పైన చెప్పుకున్నవే. ఇంటా బయటా చాకిరి చేస్తూ పెద్దవారిని చూసుకుంటూ ఎవరైనా ఎన్నాళ్ళు చెయ్యగలరు? అందుకే మహిళలు ఉద్యోగాలు చేసే పరిస్థితులు కల్పించాలని ప్రభుత్వాలకు సూచించింది.

ముప్పయ్యేళ్ళక్రితం నేనున్న పరిస్థితికి, ఇప్పటి ఉద్యోగినుల అవస్థలకు పెద్దగా తేడా లేదు. కాకపోతే అమ్మాయిల్లో క్లారిటీ బాగా పెరిగింది. తమకి ఏది కావాలో అదే ఎంచుకుంటున్నారు. మరి వారు ఉద్యోగం చేస్తేనే దేశం గడుస్తుందంటారా? మా ప్రభుత్వాలకి చెప్పి ఇంటిపని, పిల్లలు, పెద్దవాళ్ళ బాధ్యత పురుషులు కూడా పంచుకునేలా చట్టం చేయించండి. భారత మహిళలందరూ ప్రపంచ బ్యాంకుకి జై కొట్టకపోతే అడగండి. ఇంతకీ అందుకు సనాతన ధర్మం ఒప్పుకుంటుందో లేదో!

-కె. శోభ




## ఒంటరి మహిళకు మూడు సెంట్లు స్థలం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈదుపురం గ్రామనికి చెందిన ఒంటరి మహిళ బలిజపల్లి జానకికి సీఎం చంద్రబాబు హామీమేరకు 3సెంట్ల ఇంటి స్థలాన్ని మంజూరు చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ సంయుక్తంగా లబ్ధిదారురాలకు ఇళ్ల పట్టా పంపిణీ చేశారు. ఇటీవల ఈదుపురంలో దీపం–2 పథకాన్ని ప్రారంభించిన సందర్భంగా సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు వారం రోజుల్లో అమలు చేయడంపై లబ్ధిదారురాలు హర్షం వ్యక్తం చేశారు.



## కార్మికుల వేతనాలు చెల్లించాలి

(సత్యంన్యూస్, టెక్కలి)

రావివలస మెట్‌కోర్ ఎల్లాయిస్ కంపెనీ కార్మికులకు 2023 మే నుంచి పెండింగ్‌లో ఉన్న జీతాలు తక్షణమే చెల్లించాలని సిఐటియు నాయకులు నంబూరు షణ్ముఖరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ నాయకులతో కలిసి కార్మికులు కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదుపై స్థానిక అసిస్టెంట్ లేబరు కమీషనర్ ఆర్.రాధాకుమారి వద్ద నిర్వహించిన విచారణలో కార్మిక నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వీసు బెనిఫిట్స్ పూర్తిస్థాయిలో చెల్లించకుండా కంపెనీ దివాలా తీసినట్లుగా చూపించి కార్మికులను మోసం చేశారన్నారు. పాతయాజమాన్యం ఐపి పెట్టి, లిక్విడేటరును నియమించారన్నారు. కంపెనీ ఆస్తులను కొద్దిమేరకు చూపి కార్మికులకు చెల్లించాల్సిన పూర్తిస్థాయి బెనిఫిట్స్ చెల్లించలేదని స్పష్టం చేశారు. ప్యాక్టరీ కొనుగోలు చేసినట్టు చెబుతున్న యాజమాన్యాలు కార్మికులకు వాస్తవాలు చెప్పలేదన్నారు. రెగ్యులర్ కార్మికులను బలవంతంగా రాజీనామా చేయమని చెప్పి, రోజు కూలీలుగా కొద్ది నెలలు నడిపి పరిశ్రమను మూసేశారన్నారు. కంపెనీ యాజమాన్యం, ప్రభుత్వ అధికారులు కార్మికులను మోసం చేసారన్నారు. విచారణలో ఆయనతో పాటు కార్మిక సంఘ నాయకులు పిట్ట గంగయ్య, పి.ఎం.డి. బోసు, కొంకి భుజంగరావు, పి.సీతారాం తదితరులు పాల్గొన్నారు.



## ట్రూఅప్ చార్జీలు ఉపసంహరించుకోవాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అదనపు ఇంధన చార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై మోపుతున్న ట్రూఅప్ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యన్నారాయణమూర్తి డిమాండ్ చేశారు. స్థానిక ఎన్.ఆర్.దాసరి క్రాంతిభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రూ.6072 కోట్లు వినియోగదారుల మీద మోపి గత ప్రభుత్వ హయాంలోని బకాయిల పేరుతో మరో రూ.11వేల కోట్ల భారం వినియోగదారుల మీద మోపడానికి సిద్ధమవడం సబబుకాదన్నారు. ఎన్నికల హామీల్లో విద్యుత్ చార్జీలు పెంచం అని చెప్పి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు మాట మార్చి విద్యుత్ చార్జీల భారం వినియోగదారుల మీద వేస్తే సహించమని, మరో ప్రజా ఉద్యమం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సహాయ కార్యదర్శి లండ వెంకట్రావు, సీనియర్ నాయకులు చాపర సుందర్ లాల్ తదితరులు పాల్గొన్నారు.



## పోటీతత్వం మెరుగైన విద్యకు సోపానం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పోటీతత్వం, విద్యార్థుల మెరుగైన విద్యకు సోపానమని ఎస్.ఎస్.ఆర్ ట్రస్ట్ అధినేత సూర శ్రీనివాసరావు పేర్కొన్నారు. గ్లోబల్ ఎంపవర్మెంట్ ఆర్గనైజేషన్, కెరియర్ ఫైర్ ఆధ్వర్యంలో జరుగుతున్న బాలల దినోత్సవం వారోత్సవాల సందర్భంగా స్థానిక న్యూ సెంట్రల్ స్కూల్లో స్పెల్బీ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్.ఎస్.ఆర్.చారిటబుల్ ట్రస్ట్ అధినేత సూర శ్రీను మాట్లాడుతూ చిన్నారులలో పోటీతత్వాన్ని పెంచే కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ సంద్భంగా పాఠశాల డైరెక్టర్ పి.శ్రీకాంత్ ముఖ్య అతిధి సూర శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో షర్మిల, మణిశర్మ, జోష్ణ స్వరూప్, జాడ సాయి, సత్యసాయి, సింగర్ సురేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.




## పెండింగ్ కేసులు దర్యాప్తు పూర్తి చేయాలి

- రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు
- సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేయాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మందస పోలీసు స్టేషన్, సోంపేట సర్కిల్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించిన ఆయన ఆయా స్టేషన్లలో నమోదైన వివిధ కేసులపై ఆరా తీశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ముందుగా స్థానిక పోలీసు సిబ్బంది డీఐజీకి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం సర్కిల్ కార్యాలయంలో ఆవరణంలో మొక్కలను నాటారు. మందసలోని నూతనంగా నిర్మించిన పోలీస్‌స్టేషన్ భవనాన్ని సందర్శించి, నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులతో సమావేశమై నిర్లక్ష్యం వహించిన అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటీవల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా అనేక రకాల సైబర్ మోసాలు జరుగుతున్నాయన్నారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రజలను అనేక విధాలుగా ప్రలోభాలు పెట్టి వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి బ్యాంకు ఖాతా నుంచి నగదు దోచుకుంటారని స్పష్టం చేశారు. సీబీఐ, సీఐడీ పోలీసులమంటూ సైబర్ నేరగాళ్లు మోసాలు చేస్తుంటారని, వీటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటీపీ, గుర్తింపు లేని లింకులు, ఫోన్‌కాల్స్ ద్వారా సైబర్ నేరగాళ్లు అనేక విధాలుగా ఆన్లైన్ ద్వారా మోసాలు చేస్తుంటారన్నారు. ఇతర ప్రాంతాల్లో, విదేశాలలో చదువుతున్న పిల్లల వివరాలు సేకరించి వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి మీ పిల్లలు డ్రగ్స్, చట్ట వ్యతిరేక కార్యకలాపాల కేసులలో బాధితులుగా ఉన్నారని బెదిరిస్తుంటారని తెలిపారు. ఈ విధంగా నగదును బ్యాంక్ అకౌంట్లకు ట్రాన్స్‌ఫర్ చేయాలని కోరుతుంటార న్నారు. ఆధార్ అడ్రస్ అప్డేట్ చేయాలని చెప్పి ఆయా చిరునామా పేరుతో మాదక ద్రవ్యాల పార్సిల్ బుక్ చేశారని భయపెట్టి నగదును కాజేస్తారని తెలిపారు. అత్యాశకు పోయి సైబర్ నేరగాళ్లు వలలో పడి మోసపోవద్దని సూచించారు. ప్రలోభపెట్టే సందేశాలు, ఫోన్ కాల్స్ వస్తే వెంటనే 1930 సైబర్ టోల్ ఫ్రీ నెంబర్, నేషనల్ కస్టమర్ హెల్ప్‌లైన్ 1800-11-4000, సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (cybercrime.gov.in)లో వివరాలు నమోదు చేసి, స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సైబర్ నేరాలపై ప్రజలందరూ కూడా అప్రమత్తతో అవగాహన కలిగి ఉండాలన్నారు. బారువా మెరైన్ పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడి భద్రతా దృష్ట్యా ముందస్తు సమాచార సేకరణపై ఆరా తీసి తీరప్రాంత గస్తీ పెంచుతూ భద్రత పర్యవేక్షించాలని అధికారులను సూచించారు. తనిఖీలలో ఎస్పీ కె.వి.మహేశ్వర్‌రెడ్డి, ఎఎస్పీ పి.శ్రీనివాసరావు, సిఐలు తిరుపతిరావు, మంగరాజు, మెరైన్ సీఐ డీవీజే రమేష్ కుమార్, ఎస్సైలు పాల్గొన్నారు.
























## ఘనంగా టౌన్‌ప్లానింగ్ దినోత్సవం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రపంచ టౌన్‌ప్లానింగ్ దినోత్సవ వేడుకలను శుక్రవారం మంగళగిరి డీటీసీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. టౌన్‌ప్లానింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కొన్న వెంకటేశ్వరరావు నేతృత్వంలో కార్యవర్గ సభ్యులంతా డైరెక్టర్ ఆర్.జె.విద్యుల్లత, అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాస్‌లు డీటీసీపీ ఎ.ప్రభాకరరావులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యుల్లత మాట్లాడుతూ దేశ, రాష్ట్ర అభివృద్ధిలో పట్టణ ప్రణాళిక పాత్ర ప్రముఖమైందన్నారు. మౌలిక సదుపాయాల కల్పనతో పట్టణాలు ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చెందడానికి టౌన్‌ప్లానింగ్ వ్యవస్థ మరింత కష్టపడి పని చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు అబ్దుల్ సత్తార్, కార్యదర్శి మోహన్‌బాబుతోపాటు రాయలసీమ, ప్రకాశం, క్రిష్ణా జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.



## జాతీయ స్థాయిలో సత్తా చాటిన ప్రణవి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



33వ అఖిల భారత జీవీ మవలాంకర్ షూటింగ్ ఛాంపియన్‌షిప్- 2024 రైఫిల్ విభాగంలో జిల్లాకు చెందిన వజ్జ ప్రణవి సత్తా చాటింది. 29 రాష్ట్రాల నుంచి పాల్గొన్న జాతీయస్థాయి ఛాంపియన్‌షిప్ పోటీలో వజ్జ ప్రణవి నాలుగు కాంస్య పతకాలను సొంతం చేసుకున్నట్టు కొచ్ కె.వై.శీరేంద్ర తెలిపారు. టెక్కలి మండలం తిర్లంగి గ్రామానికి చెందిన శ్రీనివాసరావు, శిరీష దంపతుల కుమార్తె వజ్జ ప్రణవి. కేరళ రాష్ట్రం తిరువనంతపురంలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో సబ్ యూత్ ఉమెన్ ఇండివిద్యువల్, యూత్ ఉమెన్ ఇండివిద్యువల్, జూనియర్ ఉమెన్ ఇండివిద్యువల్, ఉమెన్ ఇండివిద్యువల్ విభాగంలో నాలుగు మెడల్స్ సొంతం చేసుకుని తృతీయ స్థానంలో నిలిచిందన్నారు. తిరువనంతపురంలో గురువారం జరిగిన బహుమతి ప్రధాన కార్యక్రమంలో డైరెక్టరేట్ ఆఫ్ స్పోర్ట్స్ అండ్ యూత్ అఫైర్స్ డైరెక్టర్ పి.విష్ణురాజు మెడల్స్‌ను ప్రణవికి బహుకరించారు. నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన ఈ విభాగంలో ఏపీ నుంచి జిల్లాకు చెందిన వజ్జ ప్రణవి ప్రత్యేక గుర్తింపు పొందడం పట్ల హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నేషనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గొండ్యాల దుర్గా ప్రసాద్, పలువురు అభినందించారు.



## వ్యాస రచన పోటీలలో పద్మావతి విద్యార్థుల ప్రతిభ

(సత్యంన్యూస్,నరసన్నపేట)

సత్యసాయి 99వ జన్మదిన వేడుకల సందర్భంగా రాష్ట్ర సత్యసాయి సంస్థల నిర్వహణలో జరిగిన వ్యాసరచన పోటీల్లో స్థానిక పద్మావతి జూనియర్ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. జిల్లాస్థాయిలో సిహెచ్ సాయికోమల్ మాధవి ద్వితీయ స్థానంలో నిలవగా సమితిస్థాయిలో పి.హేమలత, కె.మేనకలు విజేతలుగా నిలిచారని శ్రీ సత్యసాయి సేవా సంస్థల నరసన్నపేట జోనల్ కన్వీనర్ వీవీఎస్ ఎన్ మూర్తి శుక్రవారం తెలిపారు. కళాశాల డైరెక్టర్ సిహెచ్ దుర్గా ప్రసాద్, మహిళా సేవాదళ్ కోఆర్డినేటర్ అమ్మాయమ్మ, సమితి కన్వీనర్ ఎమ్.ఎల్.నాయుడు, అప్పలస్వామి వీరిని అభినందించారు.

## జిల్లాలో 17 నుండి ధాన్యం సేకరణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా ఈనెల 17 నుంచి రైతులు పండించే ధాన్యాన్ని సేకరిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లపై కలెక్టరేట్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యేలతో కలసి శుక్రవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న నాలుగు నెలలు ఛాలెంజ్‌గా తీసుకొని ప్రతీ ధాన్యం గింజ రైతుల నుంచి కొనుగోలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ధాన్యం సేకరణ ఒక పద్ధతి, విధానంలో సేకరించాలన్నారు. ఒరిస్సా నుంచి ధాన్యం రాకుండా నివారించాలని ఆదేశించారు. గత ఐదేళ్లలో ధాన్యం సేకరణ సక్రమంగా జరుగలేదన్నారు. ప్రైవేటు ఆర్గనైజేషన్ కొనుగోలు చేస్తే అలాంటివాటిని గతంలో ఏ విధంగా సేకరించిందో పరిశీలించాలన్నారు. మార్కెటింగ్, పీఏసీఎస్‌లు, స్వయం సహాయక సంఘాల ద్వారా సేకరణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ధాన్యం సేకరణ కేంద్రాలు ఎన్ని ఉండాలో పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలుకు నిబంధనలు ఎలాంటి నియమ, నిబంధనలు ఉండవన్నారు. రైతులు ఎక్కడ కావాలంటే అక్కడ విక్రయాలు చేసుకోవచ్చని వెల్లడించారు. గత ఐదేళ్లు ఏ రైస్ మిల్లు ఎన్ని టన్నుల ధాన్యాన్ని సేకరించిందో వివరాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తుందన్నారు. ధాన్యం సేకరణ ప్రతిష్టాత్మకంగా తీసుకొని కొనుగోలు చేయాలన్నారు. జిల్లా రైతులు తడి ధాన్యాన్ని తీసుకు రాకూడదని, ధాన్యం తడిగా ఉంటే ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకురావాలని రైతులను కోరారు. గ్రేడ్ ఎను ప్రమోట్ చేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, శాసనసభ్యులు గొండు శంకర్, నడికుదిటి ఈశ్వరరావు, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర రావు, ఆర్డీఓలు కె.సాయి ప్రత్యూష, కృష్ణమూర్తి, డి.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి త్రినాథస్వామి, రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు వాసు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరి వరప్రసాద్, లీడ్ బ్యాంక్ మేనేజర్ సూర్యకిరణ్ తదితరులు పాల్గొన్నారు.




## ఆర్టీసీ కాంప్లెక్స్‌ల్లో తల్లి పాలు కేంద్రాలు



(సత్యంన్యూస్,శ్రీకాకుళం)


రాష్ట్రంలోని అన్ని ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌ల్లో చంటి పిల్లలకు పాలు పట్టేందుకు అన్ని వసతులతో కూడిన ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసేలా రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసులు చేసేందుకు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు నేతృత్వంలో సిద్ధంగా ఉన్నట్టు కమిషన్ సభ్యులు గొండు సీతారాం తెలిపారు. నరసన్నపేట బస్ కాంప్లెక్స్ ప్రాంగణంలో శుక్రవారం నూతనంగా ఏర్పాటు చేసిన తల్లిపాలు ప్రత్యేక కేంద్రంను అయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జిల్లాలోని టెక్కలి, నరసన్నపేట కాంప్లెక్స్‌ల్లో ప్రత్యేక వసతులుతో ప్రత్యేక తల్లి పాలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని గత నెలలో జిల్లా ప్రజా రవాణా అధికారికి కమిషన్ ఆదేశాలిచ్చిందన్నారు. రాష్ట్రంలోని అన్ని ఆర్టీసీ కాంప్లెక్స్‌ల్లో బాలల హక్కులు, బాల కార్మిక చట్టం,బాల్య వివాహాల నిర్మూలన చట్టం, పోక్సో చట్టంతో పాటు మరిన్ని చట్టాలు, సంక్షేమ కార్యక్రమాలుపై ప్రయాణీకులకు పూర్తి అవగాహనా కలిగేలా హోర్డింగ్ బోర్డులు ఏర్పాటు చేసేందుకు వివిధ శాఖలకు ఉత్తర్వులు జారీచేసినట్టు తెలిపారు. టెక్కలి ఆర్టీసీ డిపో మేనేజర్ నక్కా శ్రీనివాసరావు మాట్లాడుతూ కమిషన్ ఆదేశాలు,రాష్ట్ర ప్రభుత్వ సూచనలతో జిల్లాలో ప్రధాన కాంప్లెక్స్‌ల్లో బాలల హక్కుల పరిరక్షణకు చేయూతతో పాటు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు.కార్యక్రమంలో నరసన్నపేట ఐ.సి.డి.ఎస్.చైల్డ్ డెవలప్మెంట్ ప్రోజెక్ట్ ఆఫీసర్ కె.నాగమణి , జిల్లా బాలల సంరక్షణ అధికారి వెంకటరమణ, మండల విద్యాశాఖాధికారి ఉప్పాడ శాంతారావు, ఆర్టీసీ మెకానికల్ సూపరింటెండెంట్ కె.రామారావు, ఎం.మల్లేశ్వర రావు, కె.శ్రీనివాస రావు,ఎం.వాసుదేవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నిస్వార్థ సేవకుడు వెంకటేష్




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

టీడీపీ నగర పరిధిలో వెన్నుదన్నుగా ఉంటూ సుదీర్ఘంగా సేవలు అందిస్తున్న నిస్వార్థ సేవకుడు మాదారపు వెంకటేష్ అని స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకులో టీడీపీ నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్ పుట్టినరోజు సందర్భంగా మెగా రక్తదాన శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగర అధ్యక్షులుగా, నందమూరి వంశ అభిమాన సంఘ నాయకునిగా విశేష సేవలందించారని కొనియాడారు. పార్టీ అధిష్టానం పిలుపునిచ్చిన ప్రతీ కార్యక్రమానికి విజయవంతం చేయడంతో వెంకటేష్ పాత్ర ఎంతో ఉందన్నారు. తన కుమారుడు డేవిడ్‌తో కలసి యశోదమ్మ చారిటబుల్ ట్రస్టు ద్వారా పేదలకు, నిరుపేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ, రోగులకు ఆర్థిక సహాయం, రక్తదాన శిబిరాలు నిర్వహణ అభినందనీయమని వెంకటేష్ సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. రక్తదానం చేసిన ప్రతీ ఒక్కరికీ అభినందనలు తెలిపారు. రక్తదాతలు ప్రాణదాతలతో సమానమని పేర్కొన్నారు. ప్రతీ ఏటా ఎన్‌టీఆర్ ఎంఎస్ఎస్ ఆధ్వర్యంలో తలసేమియా చిన్నారులకు 200 రక్తం ప్యాకెట్ల, డయాలసిస్ వారికి కిట్లు, దివ్యాంగులకు మూడు చక్రాల కుర్చీలు, ఎన్‌టీఆర్ ఎంఎస్ఎస్ ట్రస్టులో ఉన్న సభ్యుల నిరుపేదల అమ్మాయిల వివాహాలకు ఆర్థిక సహాయం అందజేస్తుంటారని చెప్పారు. తలసేమియా బోన్ మ్యారో చిన్నారులకు ఆర్థిక సహాయం కూడా అందజేశారని వివరించారు. కోవిడ్ సమయంలో ట్రస్టు ద్వారా నిత్యం ప్రజలకు నిత్యావసర సరుకులకు అందించి ఆదుకున్నారని చెప్పారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లను, మెడల్స్ అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి మాదారపు వెంకటేష్‌కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సురేంద్ర, సురేష్, మహేష్, భాస్కర్, దుర్గా, మోహన్, వెంకీ, జనార్ధన, ప్రదీప్, రాజు, ప్రసాద్‌తో పాటు, జాడ సాయి, మణిశర్మ, సత్యసాయి, వెంకటరమణలు పాల్గొన్నారు.



జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయను జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బి.సుధాకరరావు శుక్రవారం జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.
**- సత్యంన్యూస్, శ్రీకాకుళం**

## ఈనెల 11 నుంచి మనగుడి కార్యక్రమాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మన గుడి కార్యక్రమంలో భాగంగా కార్తీక మాసం మహోత్సవాలు. కిల్లిపాలెం గ్రామం శ్రీ ఉమా సహిత కైలాస ఈశ్వరస్వామి ఆలయంలో ఈనెల 11 నుంచి 17వరకు నిర్వహిస్తున్నట్టు ప్రోగ్రాం అసిస్టెంట్ ఎం.లలితమణి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బంకుపల్లి రమేష్‌శర్మతో కార్తీక మాస విశిష్టతపై ఉపన్యాసం ఉంటుందన్నారు. ఈనెల 15న సాయంత్రం 6 గంటలకు కార్తీక పౌర్ణమి సందర్భంగా కార్తీక దీపోత్సవం నిర్వహిస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు.

## యోగా పోటీలకు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

స్థానిక ట్రిపుల్ ఐటీకి చెందిన తేజేశ్వరరావు, డార్విన్, శైలేష్‌బాబు జాతీయస్థాయి పారా యోగాసన పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ఆచార్య బాలాజీ శుక్రవారం అభినందించారు. నేషనల్ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆన్‌లైన్‌లో నిర్వహించిన పారా యోగాసన పోటీలలో 2,3,6 స్థానాల్లో నిలిచి డిసెంబర్ 2,3 తేదీలలో ఢిల్లీలో జరగబోయే జాతీయస్థాయి పోటీలకు పాల్గొనున్నారు. అభినందన కార్యక్రమంలో పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ కె.మోహన కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, వెల్ఫేర్ డీన్ రవి, యోగ విభాగ అధిపతి డాక్టర్ జి.ఈశ్వరరావు, యోగ అధ్యాపకులు కె.అర్చన పాల్గొన్నారు.



## కొరియాలో మెరిసిన సిక్కోలు క్రీడాకారులు



(సత్యంన్యూస్, టెక్కలి)

నెలరోజుల పాటు తైక్వాండోలో అంతర్జాతీయ శిక్షణలో జిల్లాకు చెందిన క్రీడాకారులు శిక్షణ పొంది స్వదేశానికి రావడం పట్ల పలువురు క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఒలింపిక్ క్రీడ తైక్వాండోకు పుట్టినిల్లు అయిన దక్షిణ కొరియాలోని కుక్కివన్‌లో జిల్లా నుంచి ముగ్గురు యువ క్రీడాకారులు నెల రోజులపాటు శిక్షణ పొందేందుకు అర్హత సాధించారు. నగరానికి చెందిన కొమర మోహన్ కృష్ణ, కారె మోక్షిత్, సాక్షిత్ గత నెల 11న విశాఖ నుంచి బయలుదేరి వెళ్లి తిరిగి శుక్రవారం విశాఖ చేరుకున్నారు. కుక్కివన్ వరల్డ్ తైక్వాండో హెడ్‌క్వార్టర్స్‌లో శిక్షణ పొందిన పది రోజులకే అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు వరల్డ్ తైక్వాండో న్యూ ప్రెసిడెంట్ గ్రాండ్ మాస్టర్ లీ డాంగ్ సప్ చేతుల మీదుగా కొమర మోహనకృష్ణ సత్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా వరల్డ్ తైక్వాండో చిహ్నంను బహుకరించారు. ఈ అవకాశం దొరకడం భారతీయ క్రీడాకారులకు చాలా అరుదని మోహనకృష్ణ పేర్కొన్నారు. అంతర్జాతీయ శిక్షణ అందించిన గ్రాండ్ మాస్టర్‌కు ప్రతి దేశంలోనూ తైక్వాండో సన్‌గా పిలుస్తారని జిల్లాకు చెందిన తనను దేశం నుంచి సన్‌గా స్వీకరించారని అయన తెలిపారు. నెలరోజుల పాటు దక్షిణ కొరియాలో శిక్షణ పూర్తి చేసుకుని స్వదేశానికి వచ్చిన ముగ్గురు క్రీడాకారులకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ వేణుగోపాలరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ అచ్చం నాయుడు, రాష్ట్ర ఉషు అసోసియేషన్ సహాయ కార్యదర్శి రెడ్డి శివకుమార్, కురిటి తారకరామ, సాయిరాం మురళి, సీనియర్ ప్లేయర్స్ శంకర్, గోపి, నవీన్ స్వాగతం పలికారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ధర్మాన కృష్ణదాస్, మెంటాడ సాంబమూర్తి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ముఖ్య సలహాదారు పి.సుందర్రావు మాస్టారు, డి.ఎస్.డి.ఓ శ్రీధర్, పలు క్రీడా సంఘాలు, క్రీడాకారులు అభినందించారు. మోహనకృష్ణ తండ్రి తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కొమర భాస్కరరావును ప్రత్యేకంగా అభినందించారు.




Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.